క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలు అవసరం

జెడ్‌ఈఓ అంకమరావు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అంకమరావు

మీర్‌పేట: చదువుతో పాటు క్రీడలు అవసరమని మీర్‌పేట భాష్యం స్కూల్ జెడ్‌ఈఓ అంకమరావు పేర్కొన్నారు. ఆదివారం జోన్ స్థాయి క్రీడోత్సవాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తమ విద్యాసంస్థల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. జోన్–3 విభాగంలోని 8 బ్రాంచిల్లోని విద్యార్థులు పలు రకాల ఆటలపోటీల్లో పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందారని ప్రిన్సిపాల్ స్రవంతి, హెడ్ మిస్ట్రెస్ శృతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారీ పరేడ్ నిర్వహించారు.

డీసీసీ అధ్యక్షుడు చల్లాకు శుభాకాంక్షల వెల్లువ



చల్లా నర్సింహారెడ్డిని సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మీర్‌పేట: పట్టణ మౌలిక సదుపాయాలు ఆర్థిక సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లెలగూడలోని ఆయన నివాసానికి చల్లా బాల్‌రెడ్డి, సిద్ధాల శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వెళ్లి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మురళీగౌడ్, విజయ్, పరశురాం, గాజుల ఆనంద్, ఎర్ర చంద్రమోహన్, గల్లా శ్రీకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కందుకూరులో..



చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ఆధ్వర్యంలో ఆయన్ని కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, బుక్క పాండురంగారెడ్డి, వత్తుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అబ్దుల్లాపూర్‌మెట్: కవాడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి సురమాంబదేవీ ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ముగిసాయి. ఈ ఉత్సవాలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, గుండ్లపల్లి ధన్‌రాజ్, సోలిపురం వెంకట్రాంరెడ్డి, బుర్ర మహేందర్‌గౌడ్, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు భీమగొని భాస్కర్‌గౌడ్, వెంకటేశ్, ఎండీ గౌస్‌పాష, మాజీ సర్పంచులు సేవర్తి శ్రీనివాస్, దూసరి సుజాత యాదయ్య, కవాడి శ్రీనివాస్‌రెడ్డి, ఇరుగు చిత్తారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, పెద్దఅంబర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ర్యాకల పాండు తన తల్లిదండ్రులు ర్యాకల బాలయ్య, జగదాంబ జ్ఞాపకార్థం రూ.51వేల విరాళాన్ని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య పాల్గొన్నారు.

వాదే ముస్తఫా బస్తీ.. సమస్యల కుస్తీ!

- ఏ వీధిలో చూసినా, చెత్తా, చెదారం
- వెలగని విద్యుత్ దీపాలు
- ఇబ్బందుల్లో జనం
- రోగాల బారిన చిన్నారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఇళ్లమధ్యే పారుతున్న మురుగు, కనీసం నడిచి వెళ్లేందుకు వీలులేని రహదారులు, ఏ వీధిలో చూసినా, చెత్తా, చెదారం దర్శనమిస్తాయి. అక్కడ వెలువడుతున్న దుర్వాసన, రాత్రయ్యిందంటే విద్యుత్ దీపాలు వెలగక అంధకారం వెరసి బస్తీ ప్రజలు నిత్యం సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా 22వ వార్డు పరిధిలో సమస్యలు అధికంగా ఉన్నాయి. మారుమూల గ్రామాల్లో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇక్కడి పరిస్థితిని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. హైదరాబాద్ మహానగరానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ బస్తీ తలరాత మాత్రం మారడం లేదు. ఎక్కువగా ముస్లింలు నివశించే బస్తీలో సమస్యలు పరిష్కరించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ సందర్భంగా ప్రధాన వీధులు, మజీద్‌ల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.



స్థానికులు తవ్వించిన పైప్‌లైన్

మురుగుతో సావాసం

వాటర్ ట్యాంక్ ఎగువన ఉన్న వీధిలో మురుగు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో ఆ మురుగునీరు ఇళ్ల మధ్య చేరుతుంది. ఇక్కడి నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. దీంతో ఇక్కడినుంచి దుర్వాసన వెలువడడంతో చిన్నారులు అనారోగ్యాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంజాన్ మాసం కావడంతో శుభ్రంగా ఉంటూ, ఉపవాస దీక్ష పాటిస్తున్న తాము, ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే బురద నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

సొంత నిధులతో పైప్‌లైన్..

అభివృద్ధి పనులు చేసేవారు లేక ఆ బస్తీ వాసులకు నిరాశే ఎదురవుతుంది. చేసేదేమిలేక సొంత నిధులు వెచ్చించి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానికులే చేయించుకున్నారు.



ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

ఎన్నికల కోడ్

గత ఎన్నికల ముందు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో తమ పనులు ముందుకు సాగవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్తి పన్ను వసూలుకు ఈ నెల 31 చివరి తేదీ అని ఇంటింటికి తిరిగి మున్సిపల్ సిబ్బంది వసూలు చేసుకుంటున్నారని, అదే సమయంలో తమ సమస్యలు ఎందుకు పట్టించుకోరని కొందరు వారిని నిలదీస్తున్నారు.



నిరుపయోగంగా చేతి పంపు

“ మున్సిపల్ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు



రంజాన్ సందర్భంగా కనీసం మజీద్‌ల వద్ద చెత్తా, చెదారాన్ని తొలగించకపోవడం బాధాకరం. అన్ని బస్తీల మాదిరిగా తమ బస్తీ (22వ వార్డు)లో కూడా కనీసం మొరం పోయించాలని కోరితే మున్సిపల్ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఇళ్ల మధ్య పారిశుద్ధ్య సమస్యతో సతమతమవుతున్నాం. ఇటీవల డ్రైనేజీ పైప్‌లైన్ కోసం చందాలు వేసుకొని తవ్వించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస మౌలిక వసతులు కల్పించాలి.

– నయ్యద్ హుస్సేన్, వాదే ముస్తఫా బస్తీ

పార్టీ వీడడం బాధాకరం



రంజిత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

మహేశ్వరం: బీఆర్‌ఎస్ ద్వారా పదవులు పొందిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేరడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఎంపీ రంజిత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పదవులు అనుభవించి కష్టకాలంలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాటి నవీన్, అశోక్, ప్రభాకర్, వీరుబాబు, కల్యాణ్ నాయక్, గోపాల్ నాయక్, రాఘవేందర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయండి

మాడ్గుల: నల్లవారిపల్లి గ్రామనికి సరైన రోడ్డు మార్గం లేక విద్యార్థులు, రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బీటీ రోడ్డు మంజురు చేయాలని కెఎస్‌ఆర్ మిత్ర మండలి వ్యవస్థాపకుడు సంపత్ కుమార్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి విన్నవించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా బీటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయం

కొండా సంగీతారెడ్డి

మీర్‌పేట: బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని సతీమణి సంగీతారెడ్డి పేర్కొన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి మోడీ నాయకత్వాన్ని బలపరచాలని ఆమె వాకర్స్‌ను కోరారు. ఆదివారం ఉదయం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు వద్ద కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయాలతో విడదీయరాని సంబంధం ఉందని, ఉపకారమే తప్ప అపకారం చేయని వ్యక్తిత్వమన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు తేడా ఉంటుందని, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి జాతీయ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరోసారి మోదీ ప్రధాని అవుతారని, చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు పెంద్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, భిక్షపతిచారి, కీసర హరినాథ్‌రెడ్డి, రాజశేఖర్, గోపీనాథ్, సుధాకర్‌నేత తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హయత్‌నగర్: శ్రీ సాయి తేజస్వీ పాలీ క్లినిక్, డయాగ్నాస్టిక్ సెంటర్ వారు ఆదివారం హయత్‌నగర్‌లోని సూర్యానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రోగాలతో బాధపడున్న పలువురు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకున్నారు. డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవసరమైన వారికి మందులు అందించారు. అర్హులైన వారికి 50 శాతం ఫీజు రాయితీతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు జె.వీర్స్వామి, ఉపేందర్, సుమన్‌రెడ్డి తదితరులు సేవలు అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల ఉన్నత పాఠశాలలో ఆదివారం 2011–12 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తరగతిగదిలో చేసిన అల్లర్లు, చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి వంట పాత్రల కోసం రూ. 5వేలు వితరణ చేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

‘ప్రశాంతత ముఖ్యం’

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద, మీరాఖాన్‌పేట, ఆకులామైలారం గ్రామాల్లో ఆదివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. హైదారాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ఆయా గ్రామాల్లోని కాలనీల్లో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తుర్కయంజాల్: కాలనీ ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని అంజనాపురి కాలనీలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వెలసిన కాలనీల్లో అనేక సమస్యలు ఉన్నాయని, దశల వారీగా వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల స్వాతి, బొక్క రవీందర్ రెడ్డి, కోశిక ఐలయ్య, కాకుమాను సునీల్, కొత్తకుర్మ మంగమ్మ, కొత్తకుర్మ శివ కుమార్, కుంట గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ..

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నగరంలోని ఆయన కార్యాలయానికి కాంగ్రెస్ శ్రేణులు క్యూ కట్టారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇబ్రహీంపట్నం సోషల్‌మీడియా ఇన్‌చార్జి ఎన్ను గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సోలిపురం వెంకట్‌రాంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేశ్, సత్యానారయణ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని ఆదివారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, నక్క శివలింగం గౌడ్, సామ భీంరెడ్డి, రేవల్లి యాదగిరి, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, శ్రీనివాస రావు, బొక్క వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నెంబర్లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్స్

- చీఫ్ సూపరింటెండెంట్ చందులాల్
- నేటినుంచి ప్రారంభం
- కడ్తాల్‌లో 509, తలకొండపల్లిలో హాజరుకానున్న 315మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కడ్తాల్: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే, పదోతరగతి పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నోడల్ అధికారి జంగయ్య తెలిపారు. ఈ కేంద్రాలు మండల కేంద్రంతో పాటు, ముద్విన్ గ్రామంలో ఏర్పాటు చేశారన్నారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏ, బీ కేంద్రాలు, కడ్తాల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల, మైసిగండి ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలతో పాటు, మరో 3 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ముద్విన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ముద్విన్‌తో పాటు, చరికొండ, ఎక్వాయిపల్లి, ఆకుతోటపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాయనున్నట్లు నోడల్ అధికారి తెలిపారు. మండలంలో మొత్తం 509 మంది విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ రాయనున్నట్లు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు చందులాల్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. దీంతో ఆదివారం వారు ఆయా పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎగ్జామ్ సెంటర్లవద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆయా పరీక్ష కేంద్రాల్లో మంచి నీటీ వసతితో పాటు, వైద్య సిబ్బంది ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఆయా పరీక్ష కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ప్రతీఒక్కరు పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ అధికారులు శ్రీధర్, చల్మారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు

పకడ్బందీగా నిర్వహించాలి: ఎంఈఓ సర్దార్‌నాయక్

తలకొండపల్లి: మండలంలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ సర్దార్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, ఒకటి మండల కేంద్రంలో, మరోకటి వెల్జాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో 315 మంది విద్యార్థులు రాయనున్నారని పేర్కొన్నారు. ఇక్కడ చీఫ్ సూపరింటెండెంట్లు ఇద్దరు, శాఖా అధికారులు ఇద్దరు, ఇన్విజిలేటర్లు 18 మందిని నియమించినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్‌ఎం, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సిబ్బంది విధిగా ఐడీ కార్డులు ధరించాలన్నారు. నేటి నుంచి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని హెచ్చరించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవు

రామేశ్వర వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

నేటి నుంచి ఉత్సవాలు

కడ్తాల్: అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో కొండపై వెలసిన శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో కొన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకుడు కోర్పోలు లీలా లక్ష్మారెడ్డి దంపతుల సహకారంతో నూతన నిర్మాణం, శ్రీరామ పట్టాభిషేకం, శివపార్వతులు, సరస్వతి దేవి, శ్రీచక్ర విగ్రహప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. తమిళనాడులోని మహాబలిపురం శిల్పుల పర్యవేక్షణలో రూపు దిద్దుకున్న శివపార్వతులు, సరస్వతి దేవి, శ్రీచక్ర విగ్రహాలకు, ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో వాల్మీకి, ధన్వంతరి, గణపతి తదితర విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నారు. ఉత్సవ వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ శశాంకతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులు, తరలి రానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆలయ చరిత్ర

అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో వేంకటేశ్వర ఆలయం, శివాలయం, రామాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలు ఉండేవని చరిత్ర తెలుపుతుంది. గ్రామ సమీపంలో మహావృక్షం క్రింద శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ఉండేదని, భక్తులచేత పూజలందుకునేదని, రథయాత్ర సాగేదని చరిత్ర ఆనవాలు ఉన్నాయి. కాలక్రమేణ ఈ ఆలయాలు శిథిలమయ్యాయని తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామస్తుల అభీష్టం మేరకు హనుమాన్ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని అఖండ జ్యోతిని 7 సంవత్సరాల క్రితం పునర్ నిర్మించారు. ఆంజనేయ స్వామి ఆలయానికి అభిముఖంలో కొండపై గల శివాలయం, రామాలయాల్లో కూడా గతంలో పూజలు జరిగేవని చరిత్ర తెలుపుతుంది. కాలక్రమంలో శిథిలమైన శివాలయం, రామాలయాలను, పునర్ నిర్మించేందుకు, దేవాదాయ శాఖ సహకారంతో కౌన్సిల్‌ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకుడు కోర్పోలు లీలా లక్ష్మారెడ్డి దంపతులు ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కొన్ని రోజులుగా ఆలయాన్ని కోట్లాది రూపాయాలు వెచ్చించి, పునర్ నిర్మించారు.



సిద్ధమవుతున్న హోమశాల



ముస్తాబవుతున్న రామేశ్వర వీరాంజనేయ ఆలయం

విగ్రహప్రతిష్ఠ

సోమవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, వాస్తుపూజ, వాస్తు హోమం, పంచగవ్య ప్రాసన, అకల్మశహోమం, తీర్థ ప్రసాద వితరణ, భజనలు, పారాయణాలు, రక్షాబంధనం, దీక్ష స్వీకరణ, అఖస్ర దీపారాధన, మేదిని పూజ, అంకురార్పణ వంటివి నిర్వహించనున్నారు.

హాజరుకానున్న మహామహులు..

ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు శ్రీ గురు మదనానంద సరస్వతి పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామి, సరస్వతి అవధాన పీఠధిపతి మాడ్గుల నాగఫణి శర్మ, సాంద్రనంద పీఠాధ్యక్షుడు గౌరిభట్ల శ్రీనాథశర్మ, పతంజలి ఆశ్రమం సాధ్వి నిర్మలానంద భారతి మాతాజీ, తెలుగుశాఖ అధ్యక్షుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం సాగి కమలాకరశర్మ, ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్త జాలా సోమనాథ శాస్త్రీ, మళయాలస్వామి ఆశ్రమాధిపతులు పరమాత్మనందగిరి స్వామి, ప్రవచన కర్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదగిరి సంస్థాపక చార్యులు మర్రి కృష్ణారెడ్డి, భక్తి టీవీ బ్రహ్మశ్రీ కాకునూరి సూర్యనారాయణ, ప్రముఖ సినీ నటులు సుమన్ తదితరులు హాజరు కానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దేశానికి లభించిన గొప్ప ఆస్తి అంబేడ్కర్

తలకొండపల్లి: భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మహామేధావి అని, ఆయన దేశానికి లభించిన గొప్ప ఆస్తి అని ఎస్‌ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో మార్చి 26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ భారత దేశానికి దశ దిశ చూపించిన మహోన్నతమైన వ్యక్తి అని తెలిపారు. అన్యాయాలు, అసమానతలు, అణచివేతలు, అవమానాలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమ పోరాటలు చేసి, కేంద్ర, రాష్ట్ర శాసన సభలకు ఎన్నికై మొదటి న్యాయశాఖ మంత్రిగా పని చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు సుధాకర్, మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, ఎమ్మార్పీస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, రామచంద్రయ్య, వెంకటయ్య, కుమార్, కిరణ్ పూలే, యాదయ్య, వెంకటేశ్, శ్రీను, గణేశ్, అనిల్, మల్లేశ్, రమేశ్, శేఖర్, శ్రీకాంత్, సత్యం, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్